## ఉ చి తం

తెలుగు సినీరంగంలో కాంతిశ్రీకి తిరుగులేకుండా ఉంది ప్రస్తుతం. పరిశ్రమలో అడుగు పెట్టిన కొద్దికాలంలోనే హీరోయిన్‌గా ఎన్నో సినిమాల్లో నటించి, నిర్మాతలు ఎటువంటి వేషం వెయ్యమన్నా వేసింది ఎటువంటి దుస్తులు వేసుకోమన్నా వేసుకుంది. అతి తక్కువ బట్టలతో నటించింది, నర్తించింది. వానలో తడుస్తూ, హీరోచేత అన్ని బట్టలూ విప్పించుకొని, మళ్ళీ కట్టించుకుంది. (ఆ సమయంలో కొన్ని బట్టలు ఉన్నాయి. సెన్సారు ఒప్పుకోదు కాబట్టి) క్లబ్ డాన్స్ సీను మరో నాట్యతారకు ఇస్తే ఆ డబ్బు పోతుందని తానే క్లబ్ డాన్స్ కూడా చేసింది. అమ్మమ్మ కారెక్టర్ కూడా తానే వేసేసి, త్రిపాత్రాభినయాలు కూడా చేసింది. అయితే ఇక్కడో చిక్కొచ్చిపడింది.

అఖిలాంధ్ర ప్రేక్షకులూ కాంతిశ్రీ ఒంపుసొంపులు చూసేశారు అన్ని కోణాల్లోనూ. సెన్సార్ నిబంధనలవల్ల కొన్ని భాగాలు చూడలేకపోయారు. తన గ్లామర్ అంతా 70 ఎం.ఎం.లో చూపించింది. ఇంకా ఎటువంటి సీనుల్లో తన గ్లామర్ ప్రదర్శిస్తే కలకాలం సినీపరిశ్రమలో నిలబడుతుందో అని ఆలోచించసాగింది.

సరిగ్గా అదే సమయంలో....

శృంగారశ్రీ అనే నటీమణి సినీ వినీలాకాశంలో ఒక ధ్రువతారలా వెలిసింది. ఆ తార రాగానే— ఒక సినిమాలో నటించి ఆ సినిమాలో హీరోతో— వాత్స్యాయన కామసూత్రాలలోని సమస్తాభినయాలు చేసి ప్రేక్షక హృదయాలను దోచుకుంది పూర్తిగా. యువప్రేక్షకులను ఒక ఊపు ఊపేసింది. ఎక్కడ చూసినా శృంగారశ్రీ! శృంగారశ్రీ! ఆమెకు అభిమాన సంఘాలు వెలిశాయి. దీనితో కాంతిశ్రీ పరిస్థితి ఎలక్షన్‌లో పోటీ చేసే అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కదేమోనన్న భయంలా తయారైంది.

కాంతిశ్రీ ఒకరోజు ప్రముఖ సినీ పత్రికా విలేఖరులను తన బంగళాలో విందుకు ఆహ్వానించింది.

ఆమె సెక్రటరీ "మొన్ననే కదమ్మా మీ పుట్టినరోజు వెళ్ళింది! మళ్ళీ ఏమిటి?" అని అడిగింది. దానికి "నువ్వు చూస్తూ ఉండు" అంది కాంతిశ్రీ. పత్రికా విలేఖరులు ఆశ్చర్యపోయేటట్లు విందు ఏర్పాట్లు చేసింది. కానుక లిచ్చింది.

"కాంతిశ్రీగారూ, ఈ విందు వెనక ఉన్న రహస్యమేమిటి?" అని అడిగారు పత్రికా విలేఖరులు. అప్పుడు కాంతిశ్రీ ఒక ప్రకటన చేసింది.

నాలుగు రోజుల తరువాత కాంతిశ్రీ పత్రికా విలేఖరుల సమావేశం రంగురంగుల ఫోటోలతో పడింది సినీపత్రికల్లో. కాంతిశ్రీ ఫొటోలు చూసి జనం నాటుసారా తాగినట్లు పడిపోయారు.

ఇంకో నాలుగు రోజుల్లో కాంతిశ్రీ ఇంటిదగ్గర నిర్మాతలు లైనులో నిలబడ్డారు. అంతే! కాంతిశ్రీకి మరో రెండు సంవత్సరాలకు సరిపడా కాల్షీట్స్ వచ్చాయి. కొంత మంది సినిమాలు నిరాకరించవలసి వచ్చింది కూడా.

అప్పటి నుంచీ కాంతిశ్రీని హీరోయిన్‌గా బుక్‌చేసిన ప్రతి నిర్మాత సినిమాలోనూ కాంతిశ్రీ అద్భుత సెక్స్ క్లబ్ డాన్స్ ఉచితం అయి కూర్చుంది.

మూడు సబ్బులు కొంటే ఒక సబ్బు ఉచితంలాగే ఇదీ ఒక పద్ధతే మరి!

—o—